
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5


ఉగ్ర శిక్షణ ఎక్కడ పొందారు?

- ఏయే రాష్ట్రాల్లో పేలుళ్లకు కుట్ర చేశారు
- ఉగ్రవాద సానుభూతిపరులు సిరాజ్, సమీర్‌పై ప్రశ్నల వర్షం
- విచారణ వేగవంతం చేసిన ఎన్ఐఏ, ఏటీఎస్
- మూడోరోజు 10 గంటలపాటు కొనసాగిన విచారణ



విజయనగరం/క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి)

విజయనగరంలో ఉగ్ర మూలాలపై ఎన్ఐఏ, యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు విచారణ వేగవంతం చేశారు. ఉగ్రవాద సానుభూతి పరులు సిరాజ్ ఉర్ రెహ్మాన్, సయ్యద్ సమీర్‌ను మూడోరోజు ఆదివారం ఎన్ఐఏ, యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్), స్థానిక పోలీసు అధికారులు విచారించారు. విజయనగరం పోలీసు శిక్షణ కేంద్రంలో వారిని 10 గంటల పాటు విచారణ చేపట్టారు. వారిపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఉగ్రవాద విదేశీ లింకులు, ఏయే రాష్ట్రాల్లో పేలుళ్లకు కుట్ర చేశారు, ఆర్థిక లావాదేవీలు, సహాయ, సహకారాలు అం దించిన వారి వివరాలు గురించి ప్రశ్నించి నట్లు తెలిసింది. సోషల్ మీడియాలో ఫేక్, ఒరిజనల్ ఖాతాలు, కాల్‌డేటా, ఇంటర్నెట్ కాల్స్‌పై ఆరా తీశారు. సౌదీ అరేబియా నుంచి వచ్చిన నిధులు, అవి ఏయే బ్యాంక్ ఖాతాల్లోకి వెళ్లాయి వంటి విషయాలపై బ్యాంక్ అధికారులతో కూడా చర్చించినట్లు తెలిసింది. అయితే, విచారణలో సిరాజ్, సమీర్ చాలావరకు నోరుమెదపడం లేదని తెలుస్తుంది. అనేక ప్రశ్నలకు 'మాకు సంబంధం లేదని' చెబుతున్నట్లు తెలిసింది. అధికారులు మాత్రం వారి వద్దనున్న పక్కా సమాచారంతో లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఆదివారం సుమారు 10 గంటల పాటు సిరాజ్, సమీర్‌ను విచారించారు. విచారణ పూర్తయిన తరువాత సిరాజ్, సమీర్‌కు రుచి, శుచికరమైన భోజనాలు అందించారు. వారిద్దరికి ఒంట్లో ఏమాత్రం నలతగా ఉన్నా ప్రభుత్వ డాక్టర్లతో వైద్యం అందిస్తున్నారు. ఈ విచారణలో ఎన్ఐఏ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్సీ, యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ అధికారులు పాల్గొన్నారు.



విచారణలో ఏమి అడిగారంటే..

- ఉగ్రవాదం వైపు ఎందుకు వెళ్లవలసి వచ్చింది. ఎవరి ప్రేరణతో విధ్వంసం చేయాలనుకున్నారు. ఉగ్రవాద సంస్థల ప్రతినిధుల్లో ఎవరిని కలిశారు. ముఖ్యంగా ఉగ్ర శిక్షణ ఎక్కడ?. ఎవరి వద్ద శిక్షణ తీసుకున్నారు వంటి విషయాలపై అధికారులు ప్రశ్నించారు. అధికారులు ఎంత ఓపికగా అడిగినా సిరాజ్, సమీర్ నోరు విప్పడం లేదు. వారి మొండితనంతో అధికారులకు విసుగుపుట్టిస్తున్నట్లు తెలిసింది.
- ఎన్ఐఏతో పాటు తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్సీ, యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ అధికారులు వారికున్న అనుభవంతో ఎవిడెన్స్ సంపాదించుకుని, పూర్తి సమాచారం ముందస్తుగా సేకరించి సిరాజ్, సమీర్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. వీటిలో కొన్నింటికి వారు 'నో' అనే సమాధానం చెబుతున్నట్లు తెలిసింది.
- హైదరాబాద్‌లో ఉంటున్న సమయంలో సమీర్‌ను కాకుండా ఇతర ప్రాంతాల్లో కొందరిని కలిసినట్లు మాకు సమాచారం ఉంది. వారు ఎవరు, ఎందుకు కలవాల్సి వచ్చింది. వారి పేర్లేంటి? ఎక్కడ ఉంటారు. అని సిరాజ్‌ను ప్రశ్నించారు. ఢిల్లీ, ముంబాయి, బెంగళూరు, హైదరాబాద్‌లో మీ ఇద్దరు రెక్కీచేసిన ప్రాంతాలు ఏంటి.? ఎందుకు రెక్కీ నిర్వహించారనే కోణంలో విచారణ కొనసాగింది.
- ఇసార్ అహ్మద్, జాకీర్ నాయిక్, షేక్ యాకూబ్, జాంఆలీ, షేక్ జావిద్ రబ్బానితో కలిసి సిరాజ్, సమీర్ మరింత ఉగ్రవాద, మతోన్మాదం వైపు మొగ్గు చూపి పేలుళ్లకు కుట్ర పన్నినట్లు దర్యాప్తు అధికారులు, పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై విచారణ జరిపినట్లు తెలిసింది.
- ఆహీం సంస్థను ఏర్పాటు చేసి యువతను మతోన్మాదంపై ఆకర్షించేలా చేయడం, ఉగ్రవాద కార్యకలాపాలను పలు రాష్ట్రాలకు విస్తరించే విధంగా ప్రణాళికలు రూపొందించడం వంటివి చేసినట్లు అధికారుల విచారణలో తేలినట్లు తెలిసింది.
- ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాదర్, వరంగల్‌కు చెందిన పరహాన్ మోహీద్దీన్‌తో ఎటువంటి ప్రణాళిక రూపొందించారు. ప్రణాళికలో భాగంగా ఇతర మతాల వారిని ఎందుకు టార్గెట్ చేశారని ప్రశ్నించినట్లు తెలిసింది. దేశంలో ఏయే రాష్ట్రాలో రెక్కీలు నిర్వహించారని ప్రశ్నించారు.

పేరుకే అప్‌గ్రేడ్!

- సేవలు మాత్రం అంతంతే ● రోగులకు తప్పని ఇక్కట్లు
- ప్రైవేటు వైద్యమే దిక్కు ● ఇదీ జిల్లాలోని ఎనిమిది ఆస్పత్రుల పరిస్థితి



రాజాం ఏరియా ఆస్పత్రి

రాజాం, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ సేవలు మెరుగుపడడం లేదు. ప్రభుత్వం గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నా ఫలించడం లేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో హడావుడి, ఆర్భాటం తప్ప ప్రజలకు ప్రయోజనం లేకుండా పోయింది. నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు మెరుగుపరిచామని జగన్ సర్కారు ఆర్భాటం చేసింది. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. చాలా ఆస్పత్రులు ఇంకా వసతులకు దూరంగానే ఉన్నాయి. ఇక వైద్యసేవలు సైతం అందని ద్రాక్షగా ఉన్నాయి. కోట్లాది రూపాయలు ఖర్చుచేసినట్టు గణాంకాలు చూపినా.. సేవలు మాత్రం అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా ఏపీ వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న ఆస్పత్రులు రోగుల్లో విశ్వాసం కల్పించలేక పోతున్నాయి. ప్రధానంగా వైద్యసేవల్లో వెనుకబాటు కనిపిస్తోంది.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో వైద్య విధాన పరిషత్ పరిధిలో ఎనిమిది ఆస్పత్రులు ఉన్నాయి. రాజాం, గజపతినగరం, ఎస్.కోట ఏరియా ఆస్పత్రులు, బాడంగి, చీపురుపల్లి, బొబ్బిలి, భోగాపురం, నెల్లిమర్ల సీహెచ్‌సీలు ఏపీవీవీపీ పరిధిలో కొనసాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో వీటిని అప్‌గ్రేడ్ చేసినా.. సేవలు మాత్రం పెరగలేదు. పేరుకే గైనిక్, పిడియాట్రిక్, ఎముకలు, కంటి, డెంటల్, జనరల్ సర్జరీ విభాగాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. కానీ, కనీసం ఓపీ సేవలు కూడా అందించలేదు. అటు ఇన్‌పేషెంట్ విభాగం కూడా అంతంత మాత్రమే. ఆస్పత్రుల్లో చేరే వారి సంఖ్య కూడా తక్కువే. ప్రసవాలు, కుటుంబ నియంత్రణ చికిత్సలు కూడా లక్ష్యం మేరకు జరగడం లేదు. చాలా ఆస్పత్రుల్లో ఈసీజీ, ఎక్స్‌రే వంటి సేవలు కూడా సక్రమంగా అందడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయి. జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో 13 లక్షల వరకూ ఓపీ లక్ష్యాలుగా నిర్దేశించారు. అందులో సగం కూడా పూర్తిచేయలేకపోయారు. ఇన్‌పేషెంట్ల విభాగం గురించి చెప్పనవసరం లేదు. ఆపరేషన్లు, ప్రసవాల టార్గెట్ కూడా అలానే ఉంది. అన్నింటిలోనూ వెనుకబాటే కనిపిస్తోంది.

వైద్య పరీక్షలు లేవు..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. ముఖ్యంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరగడం లేదు. జ్వరం వస్తే వైద్యులు రక్త పరీక్షలకు సిఫారసు చేస్తున్నారు. సరైన పరికరాలు లేకపోవడం, కొన్నిరకాల పరీక్షలు జరపకపోవడం, ల్యాబ్ టెక్నిషియన్ లేకపోవడం వంటి కారణాలతో చాలా ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు జరగడం లేదు. దీంతో పేద, సామాన్య ప్రజలు ప్రైవేట్ ల్యాబ్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. సొంత డబ్బులు ఖర్చుపెట్టాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎక్స్‌రే, స్కానింగ్ విభాగాలు ఉన్నా రోగులకు రకరకాల కారణాలు చెప్పి బయటకు పంపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. కనీసం వైద్య విధాన పరిషత్‌లో ఉన్న ఆస్పత్రుల్లో సేవలు మెరుగుపరిస్తే జిల్లా వ్యాప్తంగా ప్రజలకు మేలు జరిగే అవకాశం ఉంది.

ప్రైవేటు ఆస్పత్రులు కిటకిట..

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వ్యాధుల సీజన్ నడుస్తోంది. ఏ ఆస్పత్రి చూసినా రోగులతో కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. అదే సమయంలో పేదలు, సామాన్యులు ప్రభుత్వ ఆస్పత్రుల వైపు వస్తున్నా.. సిబ్బంది నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేదు. దీంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తుండడంతో అవి కిటకిటలాడుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. మరికొందరు ఉన్నత చదువులు పేరిట సెలవుల్లో ఉన్నారు. దీంతో రోగులకు మెరుగైన వైద్యసేవలందడం లేదు.

ఇబ్బందులు పడుతున్నాం..

రాజాం ప్రభుత్వాస్పత్రిలో సేవలు అంతంత మాత్రంగా అందుతున్నాయి. వైద్య పరీక్షలు సక్రమంగా జరగడం లేదు. ఎక్స్‌రే, స్కానింగ్ వంటివి బయట తీసుకురామంటున్నారు. వైద్య సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అందుకే మాలాంటి వారికి ఆర్థిక భారమైనా ప్రైవేట్ వైద్యం చేయించుకుంటున్నాం.

-పినిశెట్టి గణేష్, స్థానికుడు, రాజాం

పట్టించుకోవడం లేదు..

రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి ఆశతో వెళుతుంటే నిరాశే ఎదురవుతోంది. ఒక్కోసారి పట్టించుకునేవారు కరువవుతున్నారు. ఒక రుగ్మతతో వెళుతుంటే సంబంధిత నిపుణుడు లేకుండా పోతున్నారు. మరో విభాగం వైద్యుడితో సేవలు పొందాల్సి వస్తోంది. కనీసం ఇటువంటి పెద్దాస్పత్రుల్లోనైనా సేవలు పెంచాల్సిన అవసరం ఉంది.

-పుట్టిపు కూర్మారావు, స్థానికుడు, రాజాం

లోబరచుకుని.. గర్భవతిని చేసి

- ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఘాతుకం?
- పోలీసులకు అందని ఫిర్యాదు
- రాజీ చర్చలతో ఆలస్యంగా వెలుగులోకి..

7లో

సాంకేతికతతో నిందితులను పట్టేశారు..

- సెల్ సిగ్నల్స్ ఆధారంగా వారి లొకేషన్ గుర్తింపు
- రెక్కీ నిర్వహించిన మహిళ కోసం గాలిస్తున్న పోలీసులు
- చోరీ కేసులో పురోగతి

7లో

ఈ ఏడాదీ అంతేనా..?

- బీసీ హాస్టల్‌కు వసతి కరువు
- సమస్యపై దృష్టి పెట్టని అధికారులు
- విద్యార్థులకు తప్పని అవస్థలు

7లో





జామి మండలంలోని ఓ చెరువులో పని చేస్తున్న వేతనదారులు

మస్తర్ల మాయ

- జిల్లాలో ఉపాధి హామీ పథకంలో అక్రమాలు
- పనిచేయకపోయినా బినామీ మస్తర్లతో వేతనం
- ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు కుమ్మక్కు
- సహకరిస్తున్న మండల స్థాయి అధికారులు
- చర్యలు తప్పవంటున్న డ్వామా పీడీ



విజయనగరం కలెక్టరేట్, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకంలో వేతన దారుల సంఖ్య పెంచాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడంతో దీనిని ఆసరాగా చేసుకుని కొందరు మేట్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. బినామీ మస్తర్లను ఇష్టానుసారంగా వేసి వేతనాలను మింగేస్తున్నారు. కొన్నిచోట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు ఒక్కటై ఈ వ్యవహారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వారికి మండల స్థాయి అధికారులు సహకారం అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకూ ఉపాధి హామీ పనులకు అధిక సంఖ్యలో వేతనదారులు వెళ్తుంటారు. మిగిలిన సమయంలో వ్యవసాయ, ఇతర పనులు చేసుకుంటుంటారు. అయితే, ఎక్కువ మంది (మిగతా 8వ పేజీలో..)

- గంట్యాడ మండలం నరవ గ్రామంలో కొందరు ప్రైవేట్ ఉద్యోగులు ఉన్నారు. వీరు ఉపాధి హామీ పనికి వెళ్లకపోయినా వారి పేరిట బినామీ మస్తర్లు వేశారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ పతివాడ భాస్కరరావు రెండు రోజుల కిందట జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. మేట్లు ఈ పని చేస్తున్నారంటూ అధికారులకు వివరించారు. దీనిపై వెంటనే విచారణ చేసి అందుకు కారణమైనవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


- ఎస్.కోట మండలం శివారు గ్రామంలోని ఓ వ్యక్తి ఉపాధి హామీ పనికి వెళ్లపోయినా ఆయన పేరున బినామీ మస్తర్లు వేశారు. దీంతో ఆ వ్యక్తికి చెందిన బ్యాంకు ఖాతాలో వేతన డబ్బులు జమయ్యాయి. ఈ విషయాన్ని గ్రామ యువత గుర్తించారు. సంబంధిత వ్యక్తిపై మండల అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

హత్యా?.. ఆత్మహత్యా?

- అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి
- చంపేశారంటున్న మృతుడి తండ్రి
- కాదు ఉరేసుకున్నాడంటున్న స్థానికులు
- అనాథలైన పిల్లలు
- మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు
- కోనాడ గ్రామంలో ఘటన



భూమిలో పాతిపెట్టిన భూలోక మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు



భూలోక (ఫైల్)

పూసపాటిరేగ, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాడ గ్రామంలో బొడ్డు భూలోక(40) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే, ఆయన ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు అంటుంటే, కాదు.. తన కుమారుడిని హత్య చేశారని మృతుడి తండ్రి ఆరోపిస్తున్నాడు. గ్రామస్థుల వివరాల మేరకు.. భూలోకకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య భూలోకమ్మ రెండేళ్ల కిందట ఒక ప్రమాదంలో మృతి చెందింది. నాటి నుంచి కూలి పని చేస్తూ ముగ్గురు పిల్లలను భూలోక పోషిస్తున్నాడు. శనివారం రాత్రి తన పెద్ద కుమార్తెను మందలిస్తుండగా అదే గ్రామానికి చెందిన ఆమె మేనమామ రాము అడ్డుకున్నాడు. ప్రతిసారి పిల్లలను ఎందుకు దండిస్తున్నావని భూలోకను రాము ప్రశ్నించడంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో భూలోక.. రాము తలపై కర్రతో కొట్టాడు. ఆ వెంటనే రాము బంధువులు వచ్చి భూలోకను కొట్టారు. అనంతరం ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు. పిల్లలు గ్రామంలోని తన అమ్మమ్మ వారి ఇంటికి వెళ్లిపోయారు. తరువాత భూలోక మద్యం సేవించి తన ఇంటిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఆదివారం ఉదయం వేరే వ్యక్తి వచ్చి భూలోకను పనికి పిలిచాడు. ఎంతకీ పలకకపోవడంతో తలుపులు తెరచి చూడగా లోపల ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఉన్నాడు. దీంతో వేరే వీధిలో ఉన్న భూలోక తండ్రి అప్పన్నతో పాటు మరికొందరు గ్రామస్థులు వచ్చి భూలోక మృతదేహాన్ని కిందకు దించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. అయితే, శనివారం రాత్రి భూలోక, రాము మధ్య ఘర్షణ జరిగిన (మిగతా 8వ పేజీలో..)



భూలోక కుమార్తెలు

SCHOLARSHIP ALERT

Satya Scholarship Program

Description: The Nehru Sidhant Kender Trust invites applications from Class 12 graduates who have scored at least 60% and are pursuing undergraduate (UG) or integrated master's programs at selected colleges/universities (Institutes) located in Ludhiana district. With full tuition coverage, this scholarship is dedicated to empowering bright, deserving students from diverse socio-economic backgrounds, helping them turn aspirations into achievements and build a future without financial barriers.

Eligibility: Open to students pursuing 3-5 year UG/integrated master's courses in eligible courses of Commerce (BBA, BCom), Engineering (BTech, B.E., B.Sc. (Engineering), BCA, B.Arch.), and Medical (MBBS, BDS, BPT, B.Sc. (Nursing), B.Sc. (Paramedics)) from select colleges/universities (Institutes) located in Ludhiana district.

- Must have passed Class 12 board exams from Ludhiana district with a minimum of 60% marks.
- Annual parents' income must not exceed INR 5 Lakh from all sources. In case of orphan students, the guardian's income should be less than INR 5 Lakh.
- Preference given to girls, athletes (state/national/international level), persons with disabilities, orphans, and children of single parents.
- Should not be a recipient of any other educational scholarship.

Prizes & Rewards: 100% tuition fee coverage for the entire course duration.

- Hostel and mess charges may be considered on a case-by-case basis if campus residence is mandatory.
- Reimbursement of partial or full tuition fees paid in the first year, transferred directly to the student's or parent's account.

Last Date to Apply: 31-07-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SAT1

Mirae Asset Foundation Scholarship Program

Description: Mirae Asset Foundation invites applications from students who are currently pursuing undergraduate or postgraduate courses across India.

Eligibility: Open to students who are currently pursuing undergraduate or postgraduate courses across India. Applicants must have scored at least 60% in the previous academic year. The annual family income of the applicants must not exceed INR 8,00,000.

Prizes & Rewards: Scholarships up to INR 50,000
Last Date to Apply: 20-06-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/MAFS3



ఐఐటీ మినహా మిగిలిన ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. ఐఐటీ, ఎన్ఐటీ లేదంటే రాష్ట్ర స్థాయి సెట్‌లో సాధించిన ర్యాంకుతో కోరుకున్న కాలేజీలో సీటు వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదు. మంచి ర్యాంకు పొందిన వారికి పేరున్న సంస్థలోనే సీటు వస్తుంది. మధ్యస్థంగా ర్యాంకు వచ్చిన విద్యార్థులకే అసలైన కష్టం. కాలేజీ ఎంపికలో వారంతా చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. అలాగే ఒకసారి చేరిన తరవాత నాలుగేళ్లు చదవాలి. ఆపై సమున్నత కెరీర్ నిర్మించుకోవాలి. భావి జీవితం బాగా ఉండాలంటే, ముందస్తు కసరత్తు చాలా అవసరం. అసలు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏది మంచిదన్న ప్రశ్నతో ఈ ప్రక్రియ మొదలవుతుంది.

ఇంజనీరింగ్ కాలేజీ ఎంపికలో ఏవి కీలకం?

దిక్సూచి DIKSUCHI

సాధారణంగా చాలా మంది విద్యార్థులు ఎంపిక విషయానికి వచ్చే సరికి ఓ పది ఇంజనీరింగ్ కాలేజీలను ఉజ్జాయింపుగా ఎంచుకొంటారు. ఆ క్రమంలోనే అక్కడి క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు జరిగిన తీరుతెన్నులు, వార్షిక ప్యాకేజీ వివరాలు తెలుసుకుంటారు. వాటికి తోడు మరో రెండు అంశాలనూ పరిశీలించాలి. పేరున్న కాలేజీల్లో నాణ్యమైన విద్య లభిస్తుంది. ఏ కాలేజీలో ఎలాంటి విద్యను అందిస్తున్నారో, వాటి ప్రమాణాలు ఏమిటో క్యాంపస్ ప్లేస్‌మెంట్ కోసం వచ్చే సంస్థలకు స్పష్టమైన అవగాహన ఉంటుంది. అసలు అలాంటి కాలేజీలకే వారు వెళ్తారు.

బ్రాండ్ ఇమేజ్

సాధారణంగా పేరున్న కాలేజీలు(బ్రాండ్ ఇమేజ్) అనగానే ఐఐటీ లాంటివి గుర్తుకు వస్తాయి. అక్కడ నాణ్యమైన విద్య లభిస్తుంది. పూర్వ విద్యార్థుల ప్రతిభ, అక్కడి ప్రొఫెసర్లు - విద్యార్థుల పరిశోధనలు ప్రామాణికంగా ఉంటాయి. మరికొన్ని కాలేజీలకూ బాగానే పేరుంటుంది. అవి ప్రామాణికాంశాలతో కాకుండా తమ ప్రచారంతో సంపాదించినవి. చిన్న కాలేజీలు, కొత్తగా ఏర్పాటైనవి ఆ స్థాయిలో ప్రచారానికి వ్యయం చేయలేవు. అందుకే కొన్ని చిన్న కాలేజీలు నాణ్యమైన విద్యను అందించినా ఆ స్థాయి ప్రచారాన్ని అందుకోలేక 'వెనుకబాట' పడతాయి. అందువల్లే కొత్త, చిన్న కాలేజీలు రిక్రూటర్లను పెద్దగా ఆకర్షించలేవు.

ఫ్యాకల్టీ

ఒక కాలేజీలోని ఫ్యాకల్టీ విద్యార్హతలు ఏమిటన్నది తప్పక పరిశీలించాలి. మొత్తం అధ్యాపకుల్లో పిహెచ్‌డి ఎంత మందికి ఉందన్నది తెలుసుకోవాలి. ఆ డిగ్రీ లేనప్పటికీ కొందరు మంచి అధ్యాపకులు ఉంటారు. అయితే, వారి సంఖ్య స్వల్పం. ఎం.టెక్ పూర్తి చేసిన వారు ఎందరున్నారన్నదీ పరిశీలించాలి. ఎందుకంటే, ఇటీవల చాలా కాలేజీల్లో బీ.టెక్ లేదంటే ఎమ్మెస్సీ పూర్తి చేసిన వారిని అధ్యాపకులుగా నియమిస్తున్నారు. అలాంటి కాలేజీల్లో నాణ్యమైన విద్యను ఆశించలేం. అధ్యాపకులు వారి ఉన్నత విద్యను ఎక్కడ పూర్తి చేశారన్నదీ చూడాలి. ప్రముఖ సంస్థల్లో విద్యాభ్యాసం చేసిన వారి నుంచి నాణ్యమైన విద్య తప్పకుండా లభిస్తుంది. అలాగే ఆ కాలేజీలో బీటెక్ వరకు చదివి, తదనంతరం ఉన్నత విద్యను ప్రతిష్ఠాత్మక సంస్థల్లో పూర్తి చేసుకొని ఉంటే ఆలోచించాల్సిన అవసరం లేదు.

అధ్యాపకుల సంఖ్య

నాణ్యమైన విద్యను పొందేందుకు అధ్యాపక- విద్యార్థి నిష్పత్తి అతి ముఖ్యమైంది. విద్యార్థుల సగటు సంఖ్య తక్కువగా ఉండే తరగతి గదుల్లో నాణ్యమైన విద్య లభిస్తుంది. అంటే సరిపడా అధ్యాపకులున్న కాలేజీల్లో మాత్రమే తరగతి గదిలో విద్యార్థుల సగటు సంఖ్య తక్కువగా ఉంటుంది. అలా కాకుండా విద్యార్థుల సంఖ్యతో పొంతన లేకుండా అధ్యాపకులు తగ్గిన పక్షంలో అది వారి పని భారాన్ని పెంచుతుంది. దాంతో వారు స్వీయ పరిశోధనకు సమయం కేటాయించుకోలేరు. సరైన రీతిలో అసైన్‌మెంట్లను, ప్రాజెక్టు వర్క్‌ను విద్యార్థులకు ఇవ్వలేరు. అలాగే వాటికి గ్రేడింగ్ ఇవ్వడమనేది వారికి అత్యంత భారంగా మారుతుంది.

పరిశోధనల తీరుతెన్నులు..

కాలేజీ అధ్యాపకులు ఎవరైనా పరిశోధన చేస్తుంటే వారికి సదరు రంగాల్లో వస్తున్న మార్పులపై సరైన అవగాహన ఉంటుంది. వారు మంచి బోధనను అందిస్తారు. గొప్పగొప్ప సంస్థల్లో పరిశోధన కొనసాగిస్తున్న వారే కానవసరం లేదు. పరిశోధన రంగంలో ఉంటే బాగా బోధిస్తారని అంచనా వేయవచ్చు. పరిశోధనకు పూర్తిగా దూరంగా ఉండే వారి నుంచి మాత్రం ఉత్తమ బోధనను ఆశించడం కష్టమే. వీలైతే మొత్తం కాలేజీ కార్యక్రమాలను లేదా కనీసం తాము ఎంచుకోవాలని భావించే శాఖ పనితీరును చూడాలి. సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారా అవి విషయాన్నీ చూడాలి.

వసతులు

ఇది మరో ముఖ్యమైన అంశం. చేరాలనుకునే విభాగంలో ల్యాబ్‌ల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలి. ఆధునిక పరికరాలు ఉన్నాయా? ఉంటే విద్యార్థులంతా ఒకేసారి ప్రయోగాలు చేసేందుకు సరిపడా ఉన్నాయా? లేకుంటే ఏదో మొక్కుబడిగా డిమాన్‌స్ట్రేటర్ చేసి చూపిస్తారా అన్నవి తెలుసుకోవాలి. మొత్తంగా కాలేజీలో వసతులు ఎలా ఉన్నాయో పరిశీలించాలి. విద్యార్థుల సంఖ్యతో పోల్చినప్పుడు సగటున ఎన్ని పుస్తకాలు లైబ్రరీలో ఉన్నాయో కనుక్కోవాలి. లైబ్రరీకి 'ఈ-జర్నల్స్' ఎన్ని అందుబాటులో ఉన్నాయి? ఎంత తలసరి బ్యాండ్ విడ్త్ ఉంది? తరగతి గదిలో కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, స్క్రీన్‌లు, ఆడియో సౌకర్యం ఉందా? క్రీడల నిర్వహణ ఎలా ఉంది లాంటి అంశాలను కేవలం ఆ కాలేజీల వెబ్‌సైట్ల నుంచి మాత్రమే పొందలేం. అందుకోసం ప్రస్తుత లేదా తెలిసిన నమ్మకమైన పూర్వ విద్యార్థులతోనైనా సంభాషించడం ఉత్తమం. వీలైతే వాటి పరిశీలనకు ఆ కాలేజీని సందర్శించడం మరో మార్గం.

ఇవీ ముఖ్యమే

సంస్థ స్థితి: ఆ సంస్థకు యూనివర్సిటీ స్థాయి ఉండే పక్షంలో అక్కడ కొత్త ఆలోచనలకు, అకడమిక్ స్వేచ్ఛకు ఎక్కువ అవకాశం ఉంటుంది. ఎంతకాలంగా మనుగడలో ఉందన్నదీ ముఖ్యమే.

క్యాంపస్: పూర్తి రెసిడెన్షియల్ క్యాంపస్ అయితే నేర్చుకొనే వాతావరణం అధికంగా ఉంటుంది.

కరికులమ్: సిలబస్‌ను తరచుగా మారుస్తున్నారా? అక్కడ ఎన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయి? వంటివీ తెలుసుకోవాలి. కొన్ని సంస్థల్లో అనేక కోర్సులుంటాయి. అయితే బోధన బాగా ఉండకపోవచ్చు.

పాఠ్య ప్రణాళిక ఎంపిక: అక్కడ ఎన్ని ఎలక్టివ్స్ అందుబాటులో ఉన్నాయి? అవి ఉద్యోగాలకు పనికి వచ్చేవా లేక ఉన్నత విద్యాభ్యాసానికి ఉపకరించేవా? ఆ సంస్థలోని విద్యార్థులు ఎక్కువగా ఉన్నత విద్యకు వెళ్తున్నారంటే - అక్కడ మంచి అభ్యసన వాతావరణం ఉన్నట్లే!

పోటీ పరీక్షలు: అక్కడి విద్యార్థులు గేట్/క్యాట్ లాంటి పరీక్షల్లో చూపిన ప్రతిభనూ గమనించాలి.

మనుగడ: ఆ కాలేజీ పది పదిహేనేళ్లుగా మనుగడలో ఉంటే, దాని పూర్వ విద్యార్థుల సంఘం ఉందా? ఉంటే మంచిది. లేదంటే.. ఆ కాలేజీని వారే పట్టించుకోనప్పుడు మనం ఎంచుకోవాల్సిన అవసరం ఉందా? అనేది నిర్ణయించుకోవాలి.

క్యాంపస్ ప్లేస్‌మెంట్: దీనిని పరిగణించాల్సిందే. కానీ ఈ ఒక్కదాన్నే పరిగణనలోకి తీసుకోవడం మాత్రం సరికాదు.

విద్యార్థుల కార్యక్రమాలు: నాలుగేళ్లు కేవలం తరగతి గది, ల్యాబ్‌లకే అంకితం కాలేము. కాబట్టి ఆ కాలేజీలో ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ ఎలా నిర్వహిస్తున్నారో తెలుసుకోవాలి.

విద్యార్థి భాగస్వామ్యం: కళాశాల నిర్వహణలో విద్యార్థులకు భాగస్వామ్యం కల్పిస్తే - అది వారిలోని నాయకత్వ లక్షణాలను వెలికితీస్తుంది. కాబట్టి దానినీ పరిశీలించాలి.

- ఇంత సమాచారం కనుగొనడం చాలా కష్టమని మీరు భావించవచ్చు. అయితే అన్ని కాలేజీల సమాచారం సేకరించాల్సిన అవసరం లేదు. కేవలం మీరు ఎంచుకోవాలని భావించే కాలేజీల గురించి సేకరిస్తే చాలు. అప్పుడు అదంత కష్టం కాబోదు. కాలేజీ వెబ్‌సైట్ కూడా ఈ విషయంలో తోడ్పడుతుంది. అందులో సమాచారం మరీ తక్కువగా ఉంటే ఆలోచించాలి. ప్రతి ఒక్కరిలో సహజ మేధస్సు అంతర్లీనంగా ఉంటుంది. అది వికసించేందుకు భౌతిక వాతావరణం తోడవ్వాలి. కుటుంబ నేపథ్యం, ఉత్తమ సహచర్యం, లక్ష్యం, ఆ దిశలో పయనం లాంటివి వికాసానికి తోడ్పడుతాయి తప్ప ఏదో ఒక కాలేజీలో విద్యాభ్యాసం చేయడం మూలంగానే అన్నీ సాధ్యం కావు. అలా అని కాలేజీ ప్రాధాన్యం తగ్గించలేం. మంచి కాలేజీలోనే విద్యార్థి ప్రతిభ వికసిస్తుందన్నది నిగ్గుతేలిన నిజం. విద్యార్థి దశలోనే అవగాహన, విశ్లేషణ, అన్వయం అనేవి అలవడతాయి.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

పదవుల కోసం రాజకీయాల్లోకి రాలేదు

-కమల్ హాసన్



పదవుల కోసమో, ముఖ్యమంత్రిని అవ్వాలనే కోరికతోనో రాజకీయాల్లోకి రాలేదని సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షుడు కమల్ హాసన్ స్పష్టంచేశారు. మణిరత్నం దర్శకత్వంలో ఆయన హీరోగా నటించిన 'థగ్‌లైఫ్' చిత్రం ఆడియో రిలీజ్ కార్యక్రమంలో మాట్లాడుతూ, 'సీఎం కావాలన్న ఉద్దేశంతో రాజకీయాల్లోకి రాలేదు. రాష్ట్ర ప్రజలకు, నా అభిమానులకు సేవ చేయాలన్న ఉద్దేశంతో వచ్చాను. అనుకున్న లక్ష్యాన్ని నిదానంగా సాధిస్తాం. ఈ ప్రయాణంలో నాతో భాగమైన వారికి ధన్యవాదాలు. 'థగ్‌లైఫ్'ను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారన్న నమ్మకం ఉంది. మేము ఒక మంచి చిత్రాన్ని నిర్మించాం. అందుకే శాటిలైట్, ఓటీటీ హక్కులు మాత్రమే విక్రయించాం. సినిమాపై ఉన్న నమ్మకంతో మేమే డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నాం. ఇలాంటి మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తే, మా బేనరులో ఎన్నో గొప్ప చిత్రాలను రూపొందిస్తాం' అని పేర్కొన్నారు.

-చెన్నై, ఆంధ్రజ్యోతి

ఆ నలుగురిలో నేను లేను

- అల్లు అరవింద్

"రెండు రోజుల నుంచి మీడియాలో 'ఆ నలుగురు... ఆ నలుగురు' అంటూ కొంచెం నెగిటివ్ టచ్ ఇచ్చి పదే పదే చెబుతున్నారు. 'కబంధ హస్తాలతో థియేటర్లను గుప్పిట పట్టారని అంటున్నారు. ఆ నలుగురిలో నేను లేను. ఆ నలుగురితో నాకు సంబంధం లేదు" అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. పర్సంటేజీ విధానం అమలు చేయకుంటే జూన్ 1 నుంచి థియేటర్ల మూసివేస్తాం అంటూ ఎగ్జిబిటర్లు కొన్ని రోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విడుదలను అడ్డుకోవడానికి తెరవెనుక కొందరు సినీ పెద్దలు ప్రయత్నిస్తున్నారనీ, ఈ నిర్ణయం వెనుక ఉన్న ఆ నలుగురిలో అల్లు అరవింద్ హస్తం ఉందంటూ మీడియాలో ఉధృతంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తనపై వస్తున్న ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు అల్లు అరవింద్ ఆదివారం మీడియా ముందుకొచ్చారు.

"ఆ నలుగురు' అని అనడం 15 ఏళ్ల క్రితం మొదలుపెట్టారు. కొవిడ్ సమయంలోనే ఆ నలుగురి వ్యాపారంలోంచి నేను బయటకు వచ్చాను. తెలంగాణలో నాకు ఉన్న ఏకైక థియేటర్ 'ఏఏఏ'. అది తప్ప నాకు మరో థియేటర్ లేదు. అలాగే ఒక్క థియేటర్ కూడా తెలంగాణలో నాకింద లీజులో లేదు. ఆంధ్రాలో 15 థియేటర్లు లీజులో నడుపుతున్నాం. గడువు తీరాక వాటిని కూడా వదులుకోవాలనుకుంటున్నాం. పాత అలవాటు ప్రకారం అందరూ నన్ను కూడా ఆ నలుగురిలో కలుపుతున్నారు. ఇకపై దయచేసి ఆ నలుగురి గురించి చెప్పేటప్పుడు అందులో నన్ను కలపొద్దు' అని అల్లు అరవింద్ కోరారు.



ఆ సమావేశాల్లో నేను పాల్గొనలేదు


'థియేటర్ల మూసివేతపై నిర్వహించిన సమావేశాల్లో నేను పాల్గొనలేదు. 'మేం థియేటర్లు మూసేస్తున్నాం, మీరు చర్చలకు రండి' అని అనడం నాకు నచ్చలేదు. అది ఏకపక్ష నిర్ణయం. మా వాళ్లకు కూడా వెళ్లొద్దు అని చెప్పాను. ఏదైనా సమస్య ఉంటే ముందు ఛాంబర్‌లో, గిల్డ్‌లో చర్చించి పరిష్కరించుకోవాలి. కుదరకపోతే ప్రభుత్వాన్ని కూడా కలవాలి. అన్నీ దారులు మూసుకుపోతే అప్పుడు థియేటర్ల బంద్ నిర్ణయం తీసుకొని ఉండాల్సింది. అలాగే క్యూబ్‌లో నేను, యూఎఫ్ఓలో సురేశ్‌బాబు భాగస్వాములం కాదు' అని అల్లు అరవింద్ వివరణ ఇచ్చారు.

పవన్‌కల్యాణ్ ఆవేదనలో అర్థం ఉంది

"పవన్‌కల్యాణ్ ఆవేదనలో అర్థం ఉంది. ఆయన సినిమా వస్తుంటే మేం థియేటర్లు మూసేస్తున్నాం అనడం పవన్ కల్యాణ్‌ను బెదిరించడమే. ఆయన సినిమా విడుదలవుతున్న సమయంలో థియేటర్లను మూసేస్తాం అనే దుస్సాహసం చేయకూడదు. థియేటర్ల మూసివేతపై ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ స్పందన సమంజసమే. పవన్ కల్యాణ్ మన ఇండస్ట్రీ నుంచి వెళ్లారు. ఎవరికి ఏ సహాయం కావాలన్నా చేస్తున్నారు. అశ్వనీదత్ గారి సినిమా విడుదలైన సమయంలో టికెట్ ధరలను పెంచమని అడగడానికి మేం వెళ్లాం. 'ఛాంబర్ తరపున వచ్చి సీఎం చంద్రబాబునాయుడు గారిని ఒకసారి కలవండి' అని ఆ సమయంలో పవన్ కల్యాణ్ చెప్పారు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ఎవరూ ఆ విషయాన్ని పట్టించుకోలేదు. వెళ్లి కలసి ఉంటే బావుండేది" అని హితవు పలికారు.

> "మాది ప్రైవేట్ వ్యాపారం. ప్రభుత్వంతో మాకు సంబంధం లేదని కొందరు అంటున్నారు. అలాంటప్పుడు మనలో పెద్దపెద్దవాళ్లందరూ గత ప్రభుత్వంలో సీఎంను మాత్రం ఎందుకు కలవాల్సి వచ్చింది?"

ఓజీ విడుదల తేదీ వచ్చేసింది



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓజీ'. డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. ప్రియాంక మోహన్ కథానాయిక. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడు. ఇందులో ఓజాస్ గంభీరా అనే శక్తిమంతమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు పవన్. రాజకీయాల్లో బిజీగా ఉన్న ఆయన ఇటీవలె ఈ సినిమా షూట్‌లోకి అడుగుపెట్టారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేశారు మేకర్స్. దసరా సందర్భంగా సెప్టెంబర్ 25న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు.

ట్రాన్స్ ఆఫ్ కుబేర



నాగార్జున, ధనుశ్, రష్మిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ చిత్ర టీజర్‌ను 'ట్రాన్స్ ఆఫ్ కుబేర' అనే పేరుతో విడుదల చేశారు మేకర్స్ ప్రధాన పాత్రధారుల శక్తిమంతమైన లుక్స్ విజువల్స్ సంగీతం ఆకట్టుకున్నాయి. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా రేంజ్‌లో జూన్ 20న విడుదలవుతోంది.

ముగిసిన కేన్స్ వేడుక.. విజేతగా ఇరానియన్ చిత్రం



ఈ నెల 13న అట్టహాసంగా ప్రారంభమైన 78వ కేన్స్ చిత్రోత్సవం శనివారం ముగిసింది. కేన్స్‌లో అత్యుత్తమ సినీ పురస్కారమైన 'గోల్డెన్ పామ్‌'ని అందుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా పలు సినిమాలు పోటీపడగా... ఈ ఏడాది ఆ ఘనతను ఇరానియన్ దర్శకుడు జాఫర్ పనాహీ తెరకెక్కించిన 'ఇట్ వజ్ జస్ట్ యాన్ ఆక్సిడెంట్' చిత్రం అందుకుంది. ఈ చిత్రంలో వహీద్ మొబస్సెరీ, మరియమ్ అఫ్షారీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఓ రోడ్ ట్రిప్ నేపథ్యంలో పలు మలుపులతో ఆసక్తికరంగా సాగే చిత్రమిది. 'అన్ సర్టెన్ రిగార్డ్' విభాగంలో 'మిస్టీరియస్ గేజ్ ఆఫ్ ది ఫ్లెమింగో' చిత్రం అవార్డు దక్కించుకుంది. 1980ల కాలంలో ఎయిడ్స్ వ్యాధిపై సమాజంలో ఉన్న మూఢనమ్మకాలపై పోరాడే 12 ఏళ్ల బాలిక కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా వీక్షకులను కదిలించింది. ఫ్రాన్స్ దర్శకుడు డియెగో సస్పెడెస్ తెరకెక్కించారు. అలాగే, మన దేశం నుంచి 'హోమ్ బౌండ్' అనే చిత్రం అన్‌సర్టెన్ రిగార్డ్‌లో ప్రదర్శితమైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది భారత్ నుంచి ప్రదర్శనకు ఎంపికైన ఏకైక సినిమా ఇదే కావడం విశేషం. అయితే ఈ చిత్రానికి పురస్కారం దక్కలేదు. ఫ్రెంచ్ నటి జూలియట్ బినోచే.. భారతీయ దర్శకురాలు, 'ఆల్ వియ్ ఇమాజిన్ ఆజ్ లైట్' ఫేమ్ పాయల్ కపాడియా తదితరులు ఈ ఏడాది జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు.

ఈ వేడుకల ప్రారంభోత్సవంలో అలియా భట్ పాల్గొనాల్సి ఉండగా, భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆగిపోయారు. చివరి రోజు గూచి బ్రాండ్ చీరలో మెరిసి ప్రత్యేకాకర్షణగా నిలిచారు.



విజేతలు వీరే:

గోల్డెన్ పామ్: ఇట్ వజ్ జస్ట్ యాన్ ఆక్సిడెంట్ (జాఫర్ పనాహీ)
గ్రాండ్ ప్రిక్స్: ద సెంటిమెంటల్ వాల్యూ (జొవాచిమ్ ట్రియర్)
ఉత్తమ దర్శకుడు: క్లెబర్ మెన్‌డోన్సా ఫిల్హో (ద సీక్రెట్ ఏజెంట్)
ఉత్తమ నటుడు: వాఘ్నర్ మౌరా (ది సీక్రెట్ ఏజెంట్)
ఉత్తమ నటి: నదియా మెలిటీ (ది లిటిల్ సిస్టర్)
అన్‌సర్టైన్ రిగార్డ్: మిస్టీరియస్ గేజ్ ఆఫ్ ది ఫ్లెమింగో (డియెగో సస్పెడెస్)

కొత్తగా..

ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది



నూతన నటీనటులతో దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'యుఫోరియా'. భూమికా చావ్లా, సారా అర్జున్, రోహిత్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో 'యుఫోరియా' నుంచి హై హై అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యానికి కాలభైరవ స్వరాలు సమకూర్చడంతో పాటు పృథ్వీచంద్ర, గాయత్రీ నటరాజన్‌తో కలసి ఆలపించారు. ఈ సందర్భంగా గుణశేఖర్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు చూపించే ఎనర్జీయే 'యుఫోరియా'. ఇదే ఎనర్జీ సినిమాలోనూ ఉంటుంది. యూత్‌ఫుల్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తీస్తున్నాను. తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అన్నారు. నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ 'హై హై పాట అందరికీ నచ్చుతుంది. ఇదొక విభిన్న చిత్రం' అన్నారు.

థియేటర్లలో చూడాల్సిన చిత్రం



అందమైన ప్రేమకథకు మిస్టరీ ఎలిమెంట్స్ జోడించి తీసిన చిత్రం 'ఘటికాచలం'. నిఖిల్ దేవాదుల హీరోగా అమర్ కామెపల్లి దర్శకత్వం వహించారు. ఒయాసిస్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై ఎంసీ రాజు నిర్మిస్తున్నారు. దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ విడుదల చేస్తున్నారు. ఈ నెల 31న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. శుక్రవారం ఎస్‌కేఎన్ చేతుల మీదుగా యూనిట్ ట్రైలర్‌ను ఆవిష్కరించింది. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రం ఇది, థియేటర్లలోనే చూడండి అని ఎస్‌కేఎన్ కోరారు.

మ్యూజికల్ లవ్ డ్రామా



సౌమిత్‌రావు, శ్రేయాసి సేన్ జంటగా నటించిన 'నిలవే' చిత్రం పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు ఈ సందర్భంగా సౌమిత్ రావు మాట్లాడుతూ 'ఇది ఓ మంచి మ్యూజికల్ డ్రామా. కొత్త వాళ్లు కూడా మంచి చిత్రాలు తీస్తారు అని నిరూపించాలని మా ప్రయత్నం' అన్నారు. 'ఓ వ్యక్తి జీవితంలో జరిగే ప్రయాణమే 'నిలవే'. సంగీతాన్ని ప్రేమతో చూపించాలని అనుకున్నాం. మా సినిమాను సపోర్ట్ చేయండి అని దర్శకుడు సాయి వెన్నం కోరారు.

'బలగం' అంజన్న కన్నుమూత



బలగం సినిమాలోని అంజన్న పాత్రతో ప్రజల మనసులు గెలుచుకున్న నటుడు గుడిబోయిన బాబు అనారోగ్యంతో వరంగల్‌లోని సంరక్ష ఆస్పత్రిలో శనివారం రాత్రి ఒంటి గంటకు తుదిశ్వాస విడిచారు. రామన్నపేటలోని ఆయన నివాసంలో పలువురు నాటక, సినిమా, సాంస్కృతిక కళాకారులు, నాయకులు, స్థానికులు ఆదివారం నివాళులర్పించారు. కమెడియన్ యెల్దండి వేణు దర్శకుడిగా, దిల్ రాజు నిర్మించిన బలగం సినిమాలో హీరో ప్రియదర్శి తాతగా బాబు నటించి ఆకట్టుకున్నారు. కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు ఆయన 20కు పైగా సినిమాల్లో నటించారు.

-వరంగల్, (ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాదీ అంతేనా..?

● బీసీ హాస్టల్‌కు వసతి కరువు ● సమస్యపై దృష్టి పెట్టని అధికారులు ● విద్యార్థులకు తప్పని అవస్థలు



శిథిలమైన వసతి గృహం

భోగాపురం, మే25 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలోని బీసీ వసతిగృహం ఈ ఏడాది కూడా పరాయి పంచన కొనసాగే అవకాశం ఉంది. భోగాపురంలో జాతీయ రహదారిని ఆనుకుని గతంలో బీసీ బాలుర వసతి గృహం ఉండేది. అయితే ఆ భవనం శిథిలం కావడంతో మండల కార్యాలయాల కూడలిలో అప్పటికే మూతపడిన ఎస్సీ బాలికల వసతి గృహంలోకి దాన్ని మార్చారు. అది కూడా పూర్తి శిథిలం కావడంతో గత్యంతరం లేని పరిస్థితిలో బీసీ వసతి గృహాన్ని భోగాపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రెండు గదుల్లో నిర్వహించారు. ఓ గదిని వంటలకు, మరో గదిని విద్యార్థుల కోసం ఉపయోగించేవారు. ఈ వసతి గృహంలో దాదాపు 60 మంది విద్యార్థులు ఉన్నారు. వారంతా ఒకే గదిలో ఉండేవారు. కనీస సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బంది పడ్డారు. ఇక్కడి వసతి గృహ సమస్యను గుర్తించిన జిల్లా అధికారులు నూతన భవనం ఏర్పాటు చేస్తామంటూ కాలం గడిపేస్తున్నారు. అయితే మరో రెండు వారాల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. అయినప్పటికీ విద్యార్థులకు వసతి సమస్యపై సంబంధిత శాఖ అధికారులు దృష్టిసారించిన దాఖలాలు లేదు. ఇక్కడి వసతి గృహంలో పిల్లలను చేర్చేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నప్పటికీ అందుకు తగ్గట్టు చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారు. ఇకనైనా వసతి గృహ విద్యార్థులకు సరైన భవనం, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాల్సి ఉంది.



హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన గదిలో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు (ఫైల్)

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం

విజయనగరం క్రైం, మే 25 (ఆంధ్రజ్యోతి): అలమండ, కంటకాపల్లి మధ్య రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహాన్ని ఆదివారం గుర్తించినట్టు జీఆర్‌పీ ఎస్‌ఐ బాలాజీరావు తెలిపారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. స్కై బ్లూ రంగు రౌండ్ నెక్ టీ షర్టు, ఆకుపచ్చ రంగు గీతలు గల ముదురు నీలం రంగుల షార్ట్ ధరించి ఉన్నాడన్నారు. ఆచూకీ తెలిపిన వారు 9440591331, 94906 17089లను సంప్రదించాలన్నారు.

అప్పారావు మృతి తీరని లోటు

విజయనగరం రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు కంది అప్పారావు మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు భవిరెడ్డి శివ ప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం జొన్నవలసలో అప్పారావు మృతి చెందిన నేపథ్యంలో పార్టీ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కుసుమంచి సుబ్బారావు, కంది సీతారాం, సుధీర్ పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

గంట్యాడ, మే 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు అన్నారు. ఆదివారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27 నుంచి కడపలో నిర్వహించనున్న మహానాడును అందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నాయకులు కొండపల్లి భాస్కర నాయుడు, కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రంది మహేశ్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జేవీవీ కృషి అభినందనీయం

విజయనగరం దాసన్నపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక రుగ్మతల నుంచి ప్రజలను బయటకు తీసుకువచ్చి వారిని చైతన్యవంతులను చేయడానికి జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డీడీ అన్నపూర్ణ, ఎంవీఆర్ కృష్ణాజీ, రామకృష్ణారావు, తిరుపతిరావు, శాంతకుమారి, లక్ష్మణరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయండి

రాజాం, మే 25 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీ పరిధిలో 142వ పోలింగ్ బూత్‌లో ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటగిరి నారాయణరావు మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు తెలియ జేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామస్థాయితో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాజాం అర్బన్ పార్టీ అధ్యక్షుడు జొన్నాడ రంజిత్, పార్టీ విస్తారక్ వేమకోటి గిరిబాబు, జనరల్ సెక్రటరీ చల్లా అజయ్‌కుమార్, సీనియర్ నాయకులు గుడివాడ నాగరాజు, చందనపల్లి సత్యనారాయణ, కడారి కైలాస్, పూర్లి వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నల చరిత్ర పుస్తకావిష్కరణ

రాజాం, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య చరిత్రను తరచి చూస్తే నేటికీ పద్యమే హృద్యమైనదని ఆంధ్ర వ్యాకరణ వాచస్పతి డాక్టర్ ఎ.గోపాలరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో రాజాం రచయితల వేదిక 124వ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన బెహరా రామకృష్ణ కవి రాసిన నల చరిత్ర ప్రబంధాన్ని ఆయన ఆవిష్కరించారు. వేదిక నిర్వాహకుడు గార రంగనాథం అధ్యక్షతన జరిగిన సాహిత్య సభలో అతిథులుగా కొత్తా భాగ్యలక్ష్మి, కుప్పిలి రామకృష్ణ రంగారావు, మేడూరి సూర్యనారా యణమూర్తి, కొత్తా రమేశ్, మధుసూదనరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

విజయనగరం రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రంలోని ఖేల్ ఇండియా కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజయనగరానికి చెందిన క్రీడాకారులు ఎం.రాంబాబు, కె.యశ్వంత్‌లను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అభినందించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయనగరం కళలు, క్రీడలు, సాహితీ, సాంస్కృతిక రంగాలకు నిలయమన్నారు. క్రీడాకారులు మరింతగా రాణించి విజయనగరం కీర్తిని నలుదిశలా వ్యాపింప చేయాలని ఈ సందర్భంగా క్రీడాకారులకు పిలుపునిచ్చారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు



రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

రేగిడి, మే 25, (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి చంద్రబాబు సర్కారు గీటురాయి అని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. ఈ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తోందన్నారు. ఆదివారం మండలంలోని కొండవలస, సరసనాపల్లి, జోడుబందల, అంబాడ, కోడిశ, లింగాలవలస, లక్ష్మీపురాలకు రూ. 7.10 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్లకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం గ్రామాల్లో ఆయన అనుచర గణంతో కలిసి పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పెద్దఎత్తున రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. దీన్ని ప్రజలు గుర్తించాలన్నారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకుడు కోండ్రు జగదీశ్, మండల నాయకులు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, పాలవలస రామచంద్రినాయుడు, పి.రామినాయుడు, కోడిశ సర్పంచ్ గురవాన రమేష్, నేతలు ధనంజయ్, వినయ్, రాజాం టీడీపీ నేతలు గురవాన నారాయణరావు పాల్గొన్నారు.

మహానాడుకు 100 వాహనాలు

రాజాం, మే 25 (ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహించనున్న మహానాడుకు స్థానిక నియోజకర్గం నుంచి 100 వాహనాలతో నాయకులు, కార్యకర్తలు బయలుదేరనున్నారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజాంలో నిర్వహించిన మినీ మహానాడు కార్యక్రమంలో బలపరిచిన 22 తీర్మానాలను చంద్రబాబుకు అందజేసి వాటిని త్వరలో పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

లక్కవరపుకోట, మే 25(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తోందని ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. ఆదివారం తన నివాసంలో 11 మందికి రూ.7.17 లక్షల సీఎంఆర్‌ఎస్ చెక్కులను విశాఖ ఎంపీ శ్రీభరత్‌తో కలిసి ఆమె అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీపీ రాంప్రసాద్‌తో పాటు జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు. ●మండలంలోని గేదెలవానిపాలెంలో అభి వృద్ధి పనులను ఆదివారం విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే లలితకుమారి ప్రారం భించారు. రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, బ్రిడ్జి, ఇంటింటా కుళాయిలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీపీ రాంప్రసాద్, టూరిజం డైరెక్టర్ సుధారాణి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, విశాఖ పార్లమెంట్ అ ధ్యక్షుడు గండి బాబ్జీ, కరెడ్ల ఈశ్వరరావు, మ ల్లునాయుడు, రమణమూర్తి, దేముడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయండి



మాట్లాడుతున్న డాక్టర్ సుంకరి

గుర్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ కార్యదర్శి, మంత్రి లోకేశ్ నాయకత్వాన్ని మరింత బలపరచడానికి ఉత్తరాంధ్రకు చెందిన యువత.. మహానాడులో పెద్దఎత్తున పాల్గొనాలని టీడీపీ సీనియర్ నాయకులు, ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని పాలవలసలో ఆయన మాట్లాడారు. సుమారు 7 లక్షల ఎకరాలకు సాగునీరు, సుమారు 80 లక్షల మందికి తాగునీరు అందించేందుకు పోలవరం, బనకచర్ల లింకేజీ ప్రాజెక్టును రూ.80,112 కోట్లతో నిర్మించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడం హర్షించదగిన విషయమన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలను తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. లోకేశ్ ఒక మంచి ప్రణాళికతో ముందుకు వస్తున్నారన్నారు. మరిన్ని కీలక బాధ్యతలు అప్పగిస్తే ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు వల్లూరి బంగారునాయుడు, మాజీ సర్పంచ్ సుంకరి పైడి నాయుడు, గేదెల అప్పలనాయుడు, వి.భాస్కరరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం



గజపతినగరంలో..

గజపతినగరం/వేపాడ మే25.(ఆంధ్రజ్యోతి): గజపతి నగరంలో ఆదివారం వర్షం కురిసింది. ఎండలు మండుతున్న వేళ ఈ వర్షం ప్రజలకు ఉపశమనం కలిగించింది. వేపాడ మండలంలోనూ ఆదివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పొలాల్లో మోకాలి లోతున నీరు చేరింది. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వేపాడలో పొలాల్లో చేరిన నీరు

అటవీ అనుమతులకు కృషిచేస్తా: ఎంపీ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీభరత్

శృంగవరపుకోట రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారపర్తి, బొడ్డవర పంచాయతీ గిరిశిఖర గ్రామం చిట్టింపాడు రోడ్ల నిర్మాణాలకు అటవీ అనుమతుల కోసం కృషిచేస్తానని ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఆదివారం బొడ్డవరలో రోడ్ల పనులకు ఆయన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో దారపర్తి గిరిశిఖర గ్రామానికి అటవీ అనుమతులు వచ్చాయన్నారు. అయితే అప్పట్లో రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో అనుమతులు రద్దయ్యాయన్నారు. ఈ రోడ్ల పనులకు అనుమతుల విషయంపై కేంద్రం దృష్టిలో పెడతానన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, టూరిజం బోర్డు కార్పొరేషన్ డైరక్టర్ ఇందుకూరి సుధారాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు, సర్పంచ్ దేవాపురపు మీన, ఉప సర్పంచ్ ఆదారి అ ప్పారావు పాల్గొన్నారు. ●జామి మండలంలోని విజినిగిరి-తానవరం మధ్య గోస్తనీ నదిపై వంతెన నిర్మాణానికి ఆదివారం ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే లలితకుమారి భూమిపూజ చేశారు. ఇందుకుగానూ ప్రభుత్వం రూ.2 కోట్లు ఉపాధి నిధులు మంజూరు చేసిందని వారు తెలిపారు. అలాగే మండలంలోని రామభద్రపురం-అగ్రహారం వరకూ రూ.కోటితో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీలుపర్తిపై దృష్టిసారిస్తా

వేపాడ, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీలుపర్తి పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక దృష్టిసారిస్తానని ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం వీలుపర్తిలో గ్రామ సచివాలయం, రైతు సేవాకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను వారు ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ శానాపతి లీల అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ త్వరలో నూతన పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతోందన్నారు. సర్పంచ్ లీల, అప్పారావు దంపతులు మాట్లాడుతూ వీలుపర్తి, వెల్దాం గ్రామాల అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగిందన్నారు. మిగిలిన శివారు గ్రామాల అభివృద్ధికి ఎంపీ, ఎమ్మెల్యే సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మంజూరు చేసిన వరి నూర్పిడి యంత్రాలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జి, మార్కెట్ కమిటీ జిల్లా చైర్మెన్ గొంప కృష్ణ, ఎస్.కోట వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు, ఎంపీడీవో సిహెచ్. సూర్యనారాయణ, ఏపీఎం సూర్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం పాటూరులో రైతు సేవా కేంద్రాన్ని ప్రాంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోట్యాడ వెంకటలక్ష్మి దంపతులు ఎంపీ, ఎమ్మెల్యేలను సత్కరించారు.

జి ప్లస్-4 నిర్మాణాలు చేపట్టండి

శృంగవరపుకోట, మే 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కనీసం వెయ్యి మంది విద్యార్థులకు భవిష్యత్‌లో ప్రవేశాలు కల్పించేందుకు వీలుగా భవన నిర్మాణాలు చేపట్టాలలని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. రూ.6 కోట్లతో నిర్మాణం చేపట్టనున్న అనుబంధ మహిళ వసతిగృహానికి ఆదివారం ఆయన, ఎమ్మెల్యే లలితకుమారితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి ప్లస్-1 నిర్మాణాలకు బదులు జి ప్లస్-4 నిర్మాణాలు చేపడితే కళాశాలలకు ఎక్కువ ఖాళీ స్థలం ఉంటుందన్నారు. నియోజకవర్గంలో ఒక్కటే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నందున దీన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డీసీఎంస్ చైర్మన్ గొంపకృష్ణ, ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి ప్రిన్సిపాల్ సిహెచ్.కేశవరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోండి



పాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ

శృంగవరపుకోట, మే 25 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు పౌష్టికాహారం తీసుకోవాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఆదివారం శృంగవరపుకోట వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు గుడ్డు, పాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో బాగా రాణించి పేరు తీసుకురావాలన్నారు. క్రీడా శిబిరంలో 105 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారని చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో. ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి.సత్యశేఖర్, స్నేహ స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష కార్యదర్శులు సుబ్బారావు, ఎ.ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

రోడ్డు పూరయ్యేలా చూడండి

శృంగవరపుకోట, మే 25 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట శివారు రేగ పుణ్యగిరి కొండ శిఖర గ్రామానికి రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ శ్రీభరత్‌ను నియోజకవర్గ జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు కోరారు. అదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మహిళ వసతి గృహానికి ఎంపీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన్ని కలిసి ఒమ్మిన వినతిపత్రం అందజేశారు.

సామాజిక సేవకు ముందుకు రండి

నెల్లిమర్ల, మే 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకు యువకులు ముందుకు రావాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, గరివిడి ఎంఈవో పోలుబోతు రామారావు అన్నారు. ఆదివారం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో నగర పంచాయితీ పరిధిలోని జరజాపుపేట ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటైంది. అదే గ్రామానికి చెందిన సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 130 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో 55 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ క్యాంప్ కో-ఆర్డినేటర్ సిహెచ్.వెంకటరమణ, యువజన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్, సంఘం ప్రతినిధులు బెల్లాన వెంకటరావు, పసుమర్తి వెంకటరమణ, తుమ్ము అశోక్, నామాల శ్రీను, కనకల గణేష్, ఉపాధ్యాయుడు మద్దిల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

లోబరచుకుని.. గర్భవతిని చేసి..

●ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఘాతుకం?

● పోలీసులకు అందని ఫిర్యాదు

●రాజీ చర్చలతో ఆలస్యంగా వెలుగులోకి..

రేగిడి, మే 25 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ ఉపాధ్యాయుడు దారి తప్పాడు. ఓ విద్యార్థినికి ప్రేమ పాఠాల చెప్పాడు. లైంగికంగా లోబరచుకుని గర్భవతిని చేశాడు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులకూ సమాచారం లేదు. మండలంలోని ఓ ఉన్నత పాఠశాలలో ఈ ఘటన జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలో ఓ గ్రామానికి చెందిన విద్యార్థిని ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. సదరు విద్యార్థిని తండ్రి చాన్నాళ్ల కిందట మృతి చెందారు. తల్లి వేరేచోట ఉండటంతో తాత ఇంట్లో ఉంటూ చదువుకొంటోంది. ఈక్రమంలో అదే పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినిపై కన్నేశాడు. విద్యార్థినిని లోబరుచుకుని లైంగకంగా దాడి చేశాడు. వేసవి సెలవులకు తల్లి వద్దకు వెళ్లిన బాలిక అక్కడ అస్వస్థతకు గురైంది. వైద్య పరీక్షలో గర్భవతి అని రిపోర్టు వచ్చినట్టు సమాచారం. దాంతో కుటుంబ సభ్యులు ఉపాధ్యాయుడిని పెద్దల సమక్షంలో నిలదీసినట్టు తెలుస్తోంది. విద్యార్థిని తల్లి నివాసం ఉంటున్న గ్రామంలో వారి కుటుంబానికి పెద్దగా అండ లేకపోవటం, పరువుకు సంబంధించిన విషయం కావటంతో వారు ఈ విషయాన్ని బయట పెట్టలేదు. ఈ క్రమంలో ఉపాధ్యాయుడు రాజీ ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ●మండలంలో తొమ్మిదో తరగతి విద్యార్థినిని ఉపాధ్యాయుడు గర్భవతిని చేశాడన్న విషయంపై ఎస్‌ఐ నీలావతి వివరణ కోరగా.. దానిపై ఎటువంటి ఫిర్యాదు రాలేదన్నారు. బాలికలపై ఎవరు అఘాయిత్యానికి ఒడిగట్టినా పోక్సో కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

లారీ నుంచి జారిపడి.. వాహనాల్లో చిక్కుకుని

● కూలీ మృతి.. మరొకరికి గాయాలు

రామభద్రపురం, మే 25(ఆంధ్రజ్యోతి): రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి కింద జారిపడి ఆ వాహనాల మధ్యలో చిక్కుకుని నలిగి దుర్మరణం పాయ్యాడు. ఎస్‌ఐ ప్రసాదరావు మేరకు.. గ్రీన్‌ఫీల్డ్ హైవే-386 మైలు రాయి రావివలస గ్రామానికి వెళ్లే దారిలో హైవే పనులకు వినియోగించే డంపర్ లారీలు ఎదురెదురుగా వస్తూ శనివారం రాత్రి ఢీకొన్నాయి. దీంతో బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీ సైలాస్ సాహో (40) లారీ నుంచి కిందపడి రెండు వాహనాల మధ్య నలిగి మృతి చెందాడు. మరొకరు గాయాలతో బయటపడి చికిత్స పొందుతున్నాడు. సాహోకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బీహార్ నుంచి రోడ్డు పనులకు వచ్చి ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడికి గాయాలు

గజపతినగరం, మే25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావాలపేట రైల్వే గేటు వద్ద ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ఓ యువకుడు జారిపడి తీవ్ర గాయాల పాలైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బొబ్బిలి జీఆర్‌పీ హెచ్‌సీ పి. రామగురువు తెలిపిన వివరాల మేరకు.. హటియా నుంచి బెంగుళూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో జార్ఖండ్ జిల్లా గుమ్ల గ్రామానికి చెందిన విజయరామ్ రోహిత్ దావాలపేట రైల్వేగేటు సమీపంలో రైలు నుంచి జారిపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించామన్నారు. స్టేషన్ సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ తెలిపారు.

సాంకేతికతతో నిందితులను పట్టేశారు..

● సెల్ సిగ్నల్స్ ఆధారంగా వారి లొకేషన్ గుర్తింపు

● రెక్కీ నిర్వహించిన మహిళ కోసం గాలింపు

● చోరీ కేసులో పోలీసుల పురోగతి

చీపురుపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): చోరీ జరిగి 24 గంటలు గడవక ముందే నిందితులు పోలీసుల చేతికి చిక్కారు. వారు వినియోగించిన సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గాలింపు చేపట్టిన పోలీసులు తెనాలిలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చీపురుపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఇద్దరు మహిళలను గాయపరిచి చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఆ మహిళల నుంచి సుమారు 20 తులాల బంగారు ఆభరణాలు దోచుకున్నట్టు చెబుతున్నారు. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు లభించిన ఆధారాల మేరకు వెనువెంటనే రంగంలోకి దిగారు. గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులు వినియోగించిన సెల్ సిగ్నల్స్ ఆధారంగా ఇప్పటికే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఘటన అనంతరం దొంగలు విశాఖపట్నం చేరుకుని, అక్కడి నుంచి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేసినట్టు పోలీసులు గుర్తించారు. చీపురుపల్లి పట్టణంలోని మెయిన్ రోడ్డులో ముందుగా రెక్కీ నిర్వహించిన మరో మహిళతో సహా దొంగతనానికి సహకరించిన మరికొంత మంది కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నట్టు తెలిసింది. సర్కిల్‌లోని ఇద్దరు ఎస్‌ఐలు, ప్రత్యేక సిబ్బందితో గాలిస్తున్నట్టు సమాచారం. ఇదిలా ఉండగా, పట్టుబడిన నిందితులను చీపురుపల్లి తీసుకుని వస్తున్నట్టు సమాచారం.

మతిస్థిమితం లేని యువకుడి హల్‌చల్





రైల్వేస్టేషన్ పైకప్పు ఎక్కి పోలీసులను బెదిరిస్తున్న యువకుడు, ఇంట్లో చొరబడేందుకు యత్నం..

కొత్తవలస, మే 25 (ఆంధ్రజ్యోతి): కొత్తవలసలో మతిస్థిమితం లేని ఓ యువకుడు శనివారం సాయంత్రం హల్‌చల్ చేశాడు. ఆర్‌పీఎఫ్, అగ్నిమాపక సిబ్బందికి చుక్కలు చూపించాడు. శనివారం సాయంత్రం కొత్తవలస రైల్వేస్టేషన్‌లోకి బీహార్ రాష్ట్రానికి చెందిన బిద్యాధర్ లోహార్ (18) ప్రవేశించి స్టేషన్‌లోని భవనాలపైకి ఎక్కాడు. అక్కడ నుంచి దూకేస్తానంటూ బెదిరించడం మొదలు పెట్టాడు. లేకుంటే అక్కడే ఉన్న హైటెన్షన్ వైర్లను పట్టుకుంటానని భయపెట్టాడు. ఆర్‌పీఎఫ్ పోలీసులు ఆ యువకుడికి ఎంతో నచ్చజెప్పారు. దగ్గరకు వస్తే విద్యుత్ తీగలను తాకుతానని బెదిరిస్తుండటంతో ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ ఎస్‌వీఎస్ రావు.. అగ్నిమాపక సిబ్బంది సాయం కోరారు. కొత్తవలస అగ్నిమాపక అధికారి వై.అశోక్‌కుమార్ అక్కడకు చేరుకుని వారించిన సదరు యువకుడు వినిపించుకోలేదు. చివరకు కొత్తవలస రైల్వేస్టేషన్‌కు విద్యుత్ సరఫరాను కొద్దిసేపు నిలపుదల చేయించారు. చివరకు అతి కష్టమ్మీద కిందకు దించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రాత్రి వరకు అదుపులో ఉం చిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆ యువకుడిని ఆదివారం విడిచిపెట్టారు. దాంతో ఆ యువకుడు శృంగవరపుకోట రోడ్డులోని తుమ్మికాపల్లి చేరుకున్నాడు. రోడ్డుపక్కన ఇళ్లల్లోకి దూరి చంపుతానని బెదిరించాడు. దాంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. యువకుడి అదుపులోకి తీసుకోవాలని కోరారు.

పిచ్చికుక్క దాడి: రెండు ఆవుల మృతి

● మరో ఆవు పరిస్థితి విషమం

పాలకొండ, మే 25(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో రెండు ఆవులు మృతి చెందగా, మరో ఆవు పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అట్టలి గ్రామంలో శిర్లి తౌడమ్మ కు చెందిన మూడు ఆవులపై రెండు నెలల కిందట పిచ్చికుక్క దాడి చేసింది. అయితే ఈ విషయం బాధితురాలు ఆలస్యంగా గ్రహించింది. ఇంతలో ఆదివారం రెండు ఆవులు చొంగ కక్కుకుని మృతిచెందాయి. మరో ఆవు పరిస్థితి విషమంగా ఉండడంతో ఊరికి దూరంగా చెట్టుకు కట్టారు. చనిపోయిన రెండు ఆవులు సుమారు రూ.లక్ష విలువ చేస్తాయని చెప్పారు. తనకు న్యాయం చేయాలని బాధితురాలు కోరింది.

హత్య కేసులో పట్టుబడిన నిందితుడు?

శృంగవరపుకోట రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరమణపేటలో వివాహిత కిడ్నాప్, హత్యకేసులో ప్రధాన నిందితుడు హరికృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. గడిచిన నాలుగు రోజులుగా ఎస్.కోట ఎస్‌ఐ ఆధ్వర్యంలో పోలీసులు ఒడిశా, ఇతర ప్రాంతాల్లో గాలించారు. ఈక్రమంలో ఒడిశా నుంచి కర్ణాటక రైలులో పారిపోయేందుకు యత్నిస్తున్న నిందితుడితో పాటు అతడికి సహకరించిన వ్యక్తి పట్టుబడినట్టు తెలుస్తోంది. ఈ విషయంపై సీఐ నారాయణమూర్తి వివరణ కోరగా నిందితులు ఎక్కడ ఉన్నారో గుర్తించామని ఇంకా అరెస్ట్ చేయలేదని తెలిపారు.

నిధులు చాలక.. నిర్మాణాలు సాగక

● కింతలివానిపేటలో పునాదులతో నిలిచిపోయిన ఇళ్ల పనులు



పునాదులతో నిలిచిపోయిన నిర్మాణాలు

బొబ్బిలి రూరల్, మే25(ఆంధ్రజ్యోతి):మండలంలోని కింతలివానిపేటలో గత ప్రభుత్వంహయాంలో మంజూరైన జగనన్న కాలనీల నిర్మాణాలు నిధులు చాలకపోవడంతో కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తి నిలిపివేశాడు. ఇక్కడ కాలనీలో 26 ఇళ్లు మంజూరుకావడంతో అప్పట్లో లబ్ధిదారులు ప్రభుత్వం నిర్మించే ఆప్షన్‌ను ఎంపికచేసుకున్నారు. దీంతో ఓవ్యక్తికి కాంట్రాక్ట్ అప్ప గించగా బిల్లులు చెల్లించిన మేరకు పనులు కొన్నిఇళ్ల పునాదులు, మరి కొన్ని శ్లాబ్‌లెవల్ వరకుచేపట్టారు. ప్రభుత్వం బిల్లులు చెల్లింపు ప్రక్రియ నిలిపివేయడంతో పనులు ముందుకు సాగలేదు. దీనికితోడు అప్పట్లో నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో లబ్ధిదారులు కూడా ముందుకురాక పోవడంతో వెరసి ఎక్కువగా పునాదిలతోనే వదిలేశారు.ప్రస్తుత ప్రభుత్వం స్పందించి ఆర్థిక చేయూత అందిస్తే ఇళ్లు నిర్మించుకుంటామని లబ్ధిదారులు చెబుతున్నారు. కాగా బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివే శారని పీఆర్ ఏఈ సుధీర్ చెప్పారు.

31 నుంచి తైక్వాండో పోటీలు

● బొబ్బిలి తైక్వాండో క్లబ్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే బేబీనాయన



తైక్వాండో పోటీల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న బేబీనాయన

బొబ్బిలి రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలిలో ఈనెల 31 నుంచి స్థానిక తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో 18వ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు బొబ్బిలి తైక్వాండో అధ్యక్షుడు, ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. ఆదివారం బొబ్బిలి కోటలో తైక్వాండో పోటీలకు సంబంధించిన బ్యానర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల నుంచి సుమారు 200 మంది సబ్ జూనియర్, జూని యర్ క్యాడెట్, సీనియర్స్ విభాగాల్లో క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొ నున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 9, 10, 11 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి చెలికాని వేణుగోపాలరావు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో కోచ్ బంకురు ప్రసాద్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

తెర్లాం మండలంలోని అప్పలంపేటకు చెందిన కలవశెట్టి రామచంద్రరా వు కుమార్తె శిరీష అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆదివారం బొబ్బిలి కోటలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వైద్యం నిమిత్తం రూ. 85,000మంజూరుకావడంతో ఆ చెక్కును కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే బేబీనాయన అందజేశారు.

100 మందికి నిత్యావసరాల పంపిణీ

బొబ్బిలిలో ఆదివారం జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా నందమూరి యువసేన సభ్యులు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన చేతుల మీదుగా 100 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులు ఆంద జేశారు.కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాంబార్కి. శరత్‌బాబు, టీడీపీ పట్టణాధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, నాయకులు బీసపు చిన్నారావు, బొట్ట శివ, రాయపురెడ్డి బాను పాల్గొన్నారు.

క్రమశిక్షణతో అభ్యసించాలి: డీఎస్పీ



మాట్లాడుతున్న భవ్యరెడ్డి

బొబ్బిలి రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థి జీవితంలో కీలకమని, క్రమశిక్షణతో అభ్యసించాలని డీఎస్పీ భవ్య రెడ్డి తెలిపారు. ఆది వారం బొబ్బిలిలో సాదీఖానాలో హుదాముస్లిం అసోసియేషన్ ఆధ్వర్యం లో ఇటీవల పదోతరగతి పరీక్షల్లో ప్రతిభకనబరిచిన ముస్లిం విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాం బార్కి. శరత్‌బాబు,హుదాఅధ్యక్షుడు మహమ్మద్ రఫీ, హుదా కమిటీ కార్య దర్శి షేక్ జాఫర్, మదరస సిరాజుల్ ఉలూమ్ ప్రిన్సిపాల్ అబుల్ కలాం, కోఆప్షన్‌సభ్యులు రియాజ్‌ఖాన్, రోటరీక్లబ్ చైర్మన్ జేసీ రాజు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవన శైలితో వ్యాధులు దూరం

● బొబ్బిలి మునిసిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు

బొబ్బిలి రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర జీవన శైలిని అను సరించడం వల్ల వ్యాధులబారిన పడకుండా ఉండవచ్చని బొబ్బిలి మునిసి పల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు తెలిపారు. ఆదివారం మునిసిపాలి టీలోని ఐదో వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో రోటరీ క్లబ్, ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత థైరాయిడ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ చైర్మన్ జేసీరాజు, సభ్యులు ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ హైమావతి, వైద్య సిబ్బంది, అంగన్ వాడీ కార్యకర్తలు, క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసన్ పాల్గొన్నారు.

రోడ్లు నిర్మించారు.. కాలువలు మరిచారు

● రామభద్రపురం కూరగాయల మార్కెట్లో నీరు నిల్వతో దుర్గంధం

రామభద్రపురం, మే25(ఆంధ్రజ్యోతి):రామభద్రపురంలోని కూరగాయల మార్కెట్‌లో వర్షం నీరునిల్వ ఉండడంతో దుర్గంధభరితంగా మారుతోంది. ఇటీవల మార్కెట్‌లో సీసీ రోడ్లు నిర్మించారే తప్ప మురుగునీరు బయటకు వెళ్లేలా కాలువలు ఏర్పాటుచేయడం మరచిపోయారు. దీంతో ఏపాటి వర్షం కురిసినా రోజుల తరబడి నీరు నిల్వ ఉంటోంది. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు చెత్తాచెదారం పేరుకుపోవడంతోపాటు నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.వర్షం నీరు నిల్వ ఉండడంతో మార్కెట్లో ఆవరణ బురదమయం మారింది.మార్కెట్ ద్వారా ఏటా లక్షలాది రూపాయలు ఆదాయం వస్తున్నా పంచాయతీ అధికారులు సౌకర్యాల కల్పనపై దృష్టి సారించడంలేదని రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పటికైనా పం చాయతీ అధికారులు స్పందించి మురుగునీరు బయటకు వెళ్లిపోయేలా నిర్మాణాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



మార్కెట్ పరిసరాల్లో నిల్వఉన్న మురుగునీరు

తలుపులు ఊడిపోయి... పెచ్చులు రాలిపోయి

● మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరిన వైనం ● ఇదీ రామభద్రపురంలో పశువైద్యశాల భవనం పరిస్థితి

రామభద్రపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): రామభద్రపురంలో ఏడు దశా బ్దాల కిందట నిర్మించిన పశువైద్యశాల భవనం నిర్వహణ, మరమ్మతులు లేకపోవడంతో శిథిలావస్థకు చేరింది. ప్రధానంగా తలుపులు, కిటికీలు ఊడిపోయాయి. శ్లాబుతోపాటు పిల్లర్ల పెచ్చులురాలిపడుతున్నాయి. ప్రస్తు తం బిక్కుబిక్కుమని సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.



గది తలుపులు ఊడిపోయిన దృశ్యం

రామభద్రపురంలోని పశువైద్యశాల భవనం 1950లో అప్పటి శ్రీకాకుళం జిల్లాలో ఈ పశువుల ఆసుపత్రిని నిర్మించారు. సుమారు 70 సంవత్సరాల కిందట నిర్మించిన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం జిల్లా లోనే ఎక్కువ పాడి పశువులు ఉన్న మండలంగా రామభద్ర పురం రికార్డుల్లో ఉంది. సుమారు ఆరు వేల ఆవులు, గేదెలు ఉన్నాయి. అలాగే పాడి పరిశ్రమపైనే ఎక్కువ మంది రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. దీంతో ప్రతిరోజూ ఇక్కడకు రామభద్రపురం మండలంలోని అన్ని గ్రామాల పాడి రైతులతోపాటు బాడంగి, దత్తిరాజేరు మండలా లకు చెందిన వందల సంఖ్యలో రైతులు పశువులను వైద్యం కోసం తీసుకొస్తున్నారు. ఈనేపథ్యంలో గదులన్నీ శిథిలావస్థలో ఉండడంతో అందుబాటులో ఉన్న ఒకేఒక గదిలో వైద్యాధికారి మందులు పెట్టుకొని సేవలందిస్తు న్నారు. వందలాది మంది ఆధారపడుతున్న ఈపశువు ల ఆసుపత్రిపై అధికారులు నిర్లక్ష్యం చూపడంపై



ఆసుపత్రి ఆవరణలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, చెత్త

పాడిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు గదుల తలుపులు ఊడి పోవడంతో మందులు ఎక్కడ నిల్వచేయాలోనని సిబ్బంది సతమత మవుతున్నారు. దీనికితోడు ఆసుపత్రికి ప్రహరీ నిర్మించకపోవడంతో శిథిలావస్థకు చేరిన గదుల్లో వేలాది రూపాయల మందులు నిల్వ చేస్తుండడంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అలాగే ఆస్పత్రి ప్రాంగణంలో పిచ్చిమొక్కలు, చెత్తా చెదారం పేరుకుపోవడంతో రైతులు, సిబ్బంది భయపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా పశువైద్యాధికారులు స్పందించి ఆసుపత్రిని ఆధునికీకరించాలని రామభద్రపురానికి చెందిన పాడి రైతు చొక్కాపు పెదరామా తదితరులు కోరుతున్నారు.



రైతు సేవాకేంద్రంగా పేరుమార్చని ఎం.బూర్జవలస ఆర్బీకే

ఆదేశాలొచ్చినా.. అమలుకు నోచుకోక

● బొబ్బిలి మండలంలో ఆర్బీకేల పేరు రైతు సేవా కేంద్రాలుగా మారని వైనం

బొబ్బిలి రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి):రైతు భరోసా కేంద్రాలను(ఆర్బీకే) రైతుసేవా కేంద్రాలుగా మార్చాలని టీడీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినా క్షేత్రస్థాయిలో అమ లుకు నోచుకోవడంలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాలకు అను సంధానంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈనేపథ్యంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలు మార్చాలని ఆదేశించింది. అయితే బొబ్బిలి 22 రైతుసేవా కేంద్రాలు కొత్తగా నిర్మించిన భవనాల్లోనే కొనసాగు తున్నాయి. వీటి పేర్లు ఇంకా ఆర్బీకేలుగానే కొనసాగుతున్నాయి. ఎం.బూర్జవలస, కోమటిపల్లి తదితర గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల పేర్లతోనే కొనసాగుతుండడం విశేషం. కాగా రైతు సేవాకేంద్రాలుగా పేరు మార్చాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయని, త్వరలో పేర్లు మార్చేల్లా చర్యలు తీసుకుంటామని ఏడీఏ మజ్జి శ్యామ్ సుందర్ తెలిపారు.

వినియోగంలో లేక.. సమస్యలు తీరక

● ప్రయాణికులకు తప్పని అవస్థలు ● రోడ్లపైనే నిరీక్షిస్తున్నవైనం
● జనావాసాల దూరంగా బస్టాండ్ నిర్మాణం ● ఇదీ మక్కువలో పరిస్థితి

మక్కువ, మే 25(ఆంధ్రజ్యోతి): మక్కువలో జనావాసాలకు దూరంగా ఆర్టీసీ బస్టాండ్ నిర్మించడంతో ప్రయాణికులు వినియోగించేందుకు ముందుకురావడంలేదు. దీంతో ప్రయాణికుల సమస్యలు తీరకపోగా మరింత పెరిగాయి. అప్పట్లో అధికారులు అనా లోచిత నిర్ణయంతో జనావాసాలకు దూరంగా కాంప్లెక్స్‌ఏర్పాటుచేశారు.దీంతో ప్రస్తుతం బస్సులు, ప్రైవేటు వాహనాలకోసం ఎండలోనే రోడ్లపై నిరీక్షించాల్సివస్తోంది.

మక్కువనుంచి నిత్యం వందలాది మంది సుదూర ప్రాంతాలకు బస్సుల్లో ఏజెన్సీలోని పలు గ్రామాలపాటు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. దీనికితో మక్కువ ఏజెన్సీలోని గిరిజనులు సేకరించిన అటవీ ఉత్ప త్తులను విజయనగరం, సాలూరు వంటి ప్రాంతాల్లో మార్కెట్‌కు తరలించేందుకు ఇక్కడే గిరిజనులు వస్తుంటారు.వారంతా తెల్లవారు బయలుదేరి మధ్యాహ్నం మక్కువ చేరుకుం టారు.ఆ సమయంలో ఎండలో వాహనాలకోసం ఎదురుచూడాల్సివస్తోంది. ఈనేపథ్యంలో బస్సుల కోసం నిరీక్షించేందుకు కనీసం షెల్టర్ కూడా లేకపోవడంతో ఎండతీవ్రతను తట్టు కోలేక దుకాణాల చెంతకుచేరాల్సివస్తోంది. దశాబ్దాలుగా ఇదేపరిస్థితి నెలకొన్నా ఏఒక్కరూ షెల్టర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవడంలేదని గిరిజనులు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు షెల్టర్‌కోసం హామీఇచ్చి తర్వాత మరిచిపోతున్నారని పలువురు వాపోతున్నారు.ఈనేపథ్యంలో మక్కువలో బస్సుషెల్టర్ నిర్మాణం కలగానే మిగిలి పోయింది. ప్రయాణికులు స్థానిక మెయిన్‌రోడ్డు జంక్షన్‌లోనే బస్సులకోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్సుల కోసం వాణిజ్య సముదాయాల ముందు వేచి



మక్కువలో ఎండలోనే నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ఉంటే వ్యాపారులు చిర్రుబుర్రులాడుతున్నారని పలువురువాపోతున్నారు. అలాగే బస్సుల కోసం వర్షాకాలంలో వానలో తడిచి ఉండడం వల్ల వ్యాధుల బారిన పడుతున్నామని గిరిజనులు చెబుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

మక్కువలోని బైరిసాగరం చెరువు సమీపంలో గతంలో బస్టాండ్ నిర్మించారు. అయితే జనావాసాలకు దూరంగాఉండడంతో ప్రయాణికులు అటువైపు కన్నెత్తి చూడడం మానేశారు. ఇదే అదునుగా కొందరు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చుకు న్నారు. దీనికి తోడు ఇక్కడ బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులు వాణిజ్య సముదాయాలను సైతం నిర్మించారు. అయితే పెద్దగా జనసంచారం లేకపోవడతో వీటిని లీజుకు ఇచ్చినా వ్యాపార కార్యకలాపాలు పెద్దగా సాగపోవడంతో వినియోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరాయి.

మాస్టర్ ట్రైనీలకు యోగాపై శిక్షణ

పార్వతీపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా మాస్టర్ ట్రైనీలకు యోగాపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహ న్‌రావు పాల్గొన్నారు. ఢిల్లీ నుంచి యోగా గురు రాహుల్‌సింగ్‌చౌహాన్ వర్చువల్ పద్ధతిలో శిక్షణ ఇచ్చారు. అనంతరం జగన్మోహన్ మాట్లాడుతూ యోగా మాసోత్సవాల్లో భాగంగా డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనీ లకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించి నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ నోడల్ అధికారి బి.సుశీల, ఎంపీడీవో జి.రమేష్, యోగా గురు మోహన్, గంత్యాల్, రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ ఎం.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

● పాలకొండ: నగర పంచాయతీ కార్యాల యంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో శిక్షణా తరగతులను నిర్వహించారు. యోగా గురూజీ జనార్ధనమాస్టార్, అడ్వకేట్ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న అధికారులు, సిబ్బంది

మస్తర్ల మాయ

(ఐదో పేజీ తరువాయి)

పనికి వెళ్తున్న సమయంలో బినామీ మస్తర్ల వ్యవహారం చోటు చేసుకుంటుంది. జిల్లా వ్యాప్తంగా 3.45లక్షల మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. వీరిలో ప్రస్తుతం రోజుకు 1,89,920 మంది పనికి వెళ్తున్నట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. ప్రతి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు మేట్లు కూడా ఉన్నారు. 30 నుంచి 50 మంది వేతనదారులకు ఒక మేటు చొప్పున ఉన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో చెరువులు, కాలువల్లో పూడిక తీయడం, ఫాంపాండ్, కందకాలు తవ్వడం వంటి పనులు జరుగుతున్నాయి. పనులకు వచ్చే వేతనదారులకు మేట్లు ఉపాధి యాప్‌లో మస్తర్లు వేస్తారు. మేట్ల సెల్‌ఫోన్‌లు పనిచేయకపోతే ఆ పరిస్థితిలో ఫీల్డ్‌అసిస్టెంట్లు తమ ఫోన్ల ద్వారా మస్తర్లు వేస్తుంటారు. అయితే, పనికి హాజరుకాని కూలీలకు కూడా మస్తర్లు వేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఆ వచ్చే వేతనాన్ని మేట్లు, బినామీ కూలీలు పంచుకుంటున్నట్లు మిగిలిన వేతనదారులు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వేతనదారులు పని ప్రదేశానికి వెళ్లినా వారు పని చేయడం లేదు. అయినా వారి ఖాతాలకు పూర్తి స్థాయిలో వేతనాలు జమవుతున్నాయి. ఇటువంటి వ్యవహారాల కోసం కొందరు మేట్లు వేతనదారుల నుంచి కొంత మొత్తంలో వసూలు చేస్తున్నారు. కొంత వాటాను మండల స్థాయి అధికారులకు ముట్టచెబుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీనికి టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోల సహకారం కూడా పూర్తి స్థాయిలో ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయాన్ని జిల్లా డ్వామా పీడీ శారదాదేవి వద్ద ప్రస్తావించగా.. 'బినామీ మస్తర్లు వేసినట్లు ఎక్కడైనా ఫిర్యాదు అందితే వెంటనే ఏపీవోల ద్వారా విచారణ చేయిస్తాం. అక్రమాలు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.'అని తెలిపారు.

హత్యా?.. ఆత్మహత్యా?

(ఐదో పేజీ తరువాయి)

సమయంలోనే తన కుమారుడిని చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరించి ఉంటారని తండ్రి అప్పన్నకు అనుమానం వచ్చింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం ఉదయం 10 గంటలకు పోలీసులు కోనాడ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. భూమిలో పాతిపెట్టిన భూలోక మృతదేహాన్ని బయటకు తీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా భూలోక ఆత్మహత్య చేసుకున్నాడా, లేక హత్య చేశారా అనేది తేలనుంది. ఎస్‌ఐ దుర్గాప్ర సాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తండ్రి భూలోక, తల్లి భూలోకమ్మ మృతితో ముగ్గురు పిల్లలు అనాథులుగా మిగిలారు. ప్రసుత్తం వీరు తమ అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నారు.

నర్సిపురంలో దుర్గాదేవి పండుగ



పార్వతీపురం రూరల్: పూజలు నిర్వహిస్తున్న విజయచంద్ర

పార్వతీపురం రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నర్సిపురం లో దుర్గాదేవి వారాల పండుగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశా రు. అమ్మవారి ఘటాలను ఊరేగించారు. ఊరేగింపులో దుర్గాదేవి వేషధా రణలు ఆకట్టుకున్నాయి. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

దేశమ్మతల్లి వారాలు..

మక్కువ: శంబర గ్రామంలో దేశమ్మతల్లి వారాల పండుగను ఆదివా రం ఘనంగా నిర్వహించారు. మహిళలు ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్లి దేశమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు

దేశ సమగ్రత కోసమే సమైక్యత యాత్ర

బొబ్బిలి రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యం, దేశసమగ్రత కోసం ఈనెల 20న చేపట్టిన సమైక్యత యాత్ర 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శంకరరావు తెలిపారు. ఆదివారం బొబ్బిలి సీపీఎం కార్యాలయంలో సమైక్యతా ప్రచార పత్రాలను ఆవిష్కరించా రు. ఈసందర్భంగా మాట్లాడుతూ పహల్గాం లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది భారతీ యులు మరణించడం బాధాకరమన్నారు. ఉగ్రవాదంపై యుద్ధం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం అమెరికాకు లొంగిపోయిందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీ ఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం పాల్గొన్నారు.

నేడు బొబ్బిలి యోగాంధ్ర

బొబ్బిలి రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయం ఆవ రణలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమం లో భాగంగాఉదయం ఆరు గంటలకు యోగా సనాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. యోగా గురువు ఎం.ఈశ్వర్రప్రసాద్, ఆయుష్ డాక్టర్ కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో యోగా సనాలు చేపడతామని పేర్కొన్నారు. అనంత రం మండల పరిషత్ కార్యాలయం మెయిన్ గేట్ నుంచి సాయిబాబా ఆలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇకపై ఏడాది పొడవునా రేషన్ కార్డులు

బొబ్బిలి రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఇకపై రేషన్ కార్డులు ఏడాది పొడవునా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లోనే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ 365 రోజులు కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ నిర్ణయం పేద, మధ్య తరగతి, దూర ప్రాంతాల్లో ఉన్న వారికి ఎంతో ప్రయోజన కరమని తెలిపారు. ఈ అవకాశాన్ని కార్డులు లేనివారంతా వినియోగించుకోవాలని కోరారు.

గ్రామదేవతల ఉత్సవాలకు ఏర్పాట్లు

పార్వతీపురంటౌన్, మే 25 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణంలోని గ్రామదేవతలు ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ ఉత్సవాలకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. జూన్ నెల ఒకటో తేదీ నుంచి మూడు రోజులు పాటు పండుగలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో తొలుత విద్యుత్‌దీపాల అలంకరణ పనులు మొదలుపెట్టారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సహకారంతో ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మ పండుగలతో పాటు బంగారమ్మతల్లి పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఆయా ఉత్సవ కమిటీ సభ్యులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు.